## 'హెచ్-సిటీ' వేగవంతానికి కార్యాచరణ సిద్ధం చేయాలి

**పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్**

సిటీబ్యూరో: హెచ్-సిటీ ప్రాజెక్ట్ పనులను వేగంగా పూర్తి చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్ అధికారులకు సూచించారు. గురువారం ఎన్ఐయూఎంలో హెచ్-సిటీలో భాగంగా రూ. 3500 కోట్లతో చేపట్టనున్న 38 రోడ్ల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన ప్రాజెక్టులు, రూ.150 కోట్లతో చేపట్టనున్న జంక్షన్ అభివృద్ధి సుందరీకరణ పనులను వేగంగా ప్రారంభించి, పూర్తి చేసేందుకు చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు ముఖ్య కార్యదర్శి దిశానిర్దేశం చేశారు. రూ.1230 కోట్లతో చేపట్టే కేబీఆర్ పార్క్ చుట్టూ ఆరు జంక్షన్లలో ఫ్లై ఓవర్లు అండర్‌పాస్‌ల నిర్మాణానికి టెండర్ ప్రక్రియ వెంటనే ప్రారంభించాలన్నారు. 125 ట్రాఫిక్ జంక్షన్లలో అడ్డుగా ఉన్న 4100 విద్యుత్ పోల్స్‌ను 3 నెలల్లోగా తరలించి జంక్షన్ల అభివృద్ధి, సుందరీకరణ పనులు చేపట్టాలని దానకిశోర్ చెప్పారు. కాగా, విరించి జంక్షన్,పెన్షన్ ఆఫీస్ లింక్ రోడ్డును క్షేత్రస్థాయిలో బల్దియా కమిషనర్ ఇలంబర్తి, ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ విశ్వప్రసాద్‌తో కలిసి దానకిశోర్ పరిశీలించారు. ట్రాఫిక్ ఇబ్బందులను దూరం చేసేందుకు విరించి రోడ్డు వద్ద రోడ్డు విస్తరణ, అభివృద్ధితో పాటు సుందరీకరణ పనులు చేపట్టాలన్నారు.


# నమస్తే తెలంగాణ
# హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, శుక్రవారం 13 డిసెంబర్ 2024 | HYDERABAD









కొండపోచమ్మ జలాశయం (ఫైల్)

# మూసీకి గోదావరి ఇంకెంత దూరం?

**ఈ నెల మొదటి వారంలోనే గోదావరి టెండర్లన్న సీఎం రేవంత్.. కేటీఆర్ ఆరోపణలతో వ్యాప్కోస్ సర్వేను తెరపైకి తెచ్చిన సర్కార్**

**మల్లన్నసాగర్, కొండపోచమ్మ, ఎల్లంపల్లి మార్గాలపై సర్వే షురూ.. గతంలోనే పథకంపై సర్వే చేసి డీపీఆర్ సమర్పించిన వ్యాప్కోస్**

**ప్రామాణికతలేని నీటి నిల్వ సామర్థ్యాన్ని సాకుగా చూపే యత్నం**

> హైదరాబాద్ మహా నగరానికి రోజుకు 270 మిలియన్ గ్యాలన్ల కృష్ణా జలాలు వస్తున్నాయి. అంటే ఏడాదికి 16.5 టీఎంసీలు. మరి... ఈ జలాలను తీసుకునే జలాశయం (సోర్స్) అక్కంపల్లి రిజర్వాయర్ సామర్థ్యం ఒకటిన్నర టీఎంసీలు.
>
> ఇదే నగరానికి రెండో దశ గోదావరి జలాలను తరలించేందుకు కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే కొండపోచమ్మ జలాశయం నుంచి డిజైన్, ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. కానీ రేవంత్ సర్కారు వచ్చి దానిని మల్లన్నసాగర్‌కు మార్చింది. తద్వారా పథకం వ్యయం కనీసంగా రూ.2వేల కోట్ల వరకు పెరుగుతుందని అంచనా. ఇదేమంటే... కొండపోచమ్మ సామర్థ్యం 15 టీఎంసీలైతే, మల్లన్నసాగర్ సామర్థ్యం 50 టీఎంసీలు కదా.. అంటున్నది.

**సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, డిసెంబర్ 12 (నమస్తే తెలంగాణ):**

వాస్తవానికి మల్లన్నసాగర్ నుంచే కొండపోచమ్మకు గోదావరి జలాలు వస్తాయి. రెండు జలాశయాల కింద భారీ ఆయకట్టు ఉన్నందున మల్లన్నసాగర్ నుంచి కొండపోచమ్మకు నీటి ఎత్తిపోత అనేది ప్రత్యేకంగా హైదరాబాద్ నగరం కోసం చేయాల్సిన పని లేదు. పైగా నగర నీటి సరఫరాతో మూసీ ప్రక్షాళన కోసం రోజు వారీగా తీసుకునేందుకు కావాల్సిన నీటి పరిమాణం కేవలం 500-600 క్యూసెక్కులు మాత్రమే. అందుకే పథకం డిజైన్ మార్పు వెనక మర్మం దాగి ఉందంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రేవంత్ సర్కారుపై ఆరోపణల అస్త్రం సంధించారు. దీంతో ప్రభుత్వం తాజాగా వ్యాప్కోస్ సర్వేను తెరపైకి తీసుకువచ్చింది. ఈ రెండు జలాశయాలతో పాటు మొదటి దశలో భాగంగా ఎల్లంపల్లి నుంచి గోదావరి జలాల తరలింపు మార్గాన్ని కూడా ఇందులో చేర్చి సర్వేను మొదలుపెట్టినట్లు తెలిసింది. గతంలో ఇదే వ్యాప్కోస్ సర్వే చేయగా... రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ అదే సంస్థతో సర్వే చేయించడం గమనార్హం.

### మూసీ సుందరీకరణ కోసమంటూ..

మూసీ సుందరీకరణ కోసమంటూ నిరుపేదల ఇండ్లను ఎడాపెడా కూల్చి వేసిన రేవంత్ సర్కారు.. మూసీ ప్రక్షాళన కోసం గోదావరి జలాల తరలింపు పథకంపై మాత్రం సర్వేల బాట పడుతున్నది. హైదరాబాద్ మహా నగరానికి రెండో దశ గోదావరి జలాల తరలింపు పథకంతో మూసీ ప్రక్షాళన ముడిపడి ఉంది. గతంలో కేసీఆర్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టులోని కొండపోచమ్మ సాగర్ నుంచి జలాల తరలింపు ఆధారంగా పథకాన్ని రూపొందించింది. ఇందులో హైదరాబాద్ నగరానికి ఏటా 10 టీఎంసీల జలాల తరలింపు పథకానికి కేవలం రూ.1100 కోట్లు మాత్రమే ఖర్చవుతుందని తేల్చారు. దీంతోపాటు రావిల్‌కోట్ చెరువు నుంచి 52 కిలోమీటర్ల గ్రావిటీ కాల్వ ద్వారా అదనంగా హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్‌కు చెరో మూడున్నర టీఎంసీలను తరలించే డిజైన్ కూడా పూర్తయింది. ఇందుకోసం కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్‌లోనే కేసీఆర్ ప్రభుత్వం 127 కిలోమీటర్ల సంగారెడ్డి కాల్వలో 27వ కిలోమీటర్ వద్ద చానెల్‌ను కూడా నిర్మించింది. ఈ పథకంలో దాదాపు గ్రావిటీపైనే గోదావరి జలాల తరలింపు జరగడంతో పాటు కేవలం 24 కిలోమీటర్ల దూరంతోనే జలాలు నగర శివారులోకి వస్తాయి. వాస్తవానికి గతంలో వ్యాప్కోస్ సంస్థనే వీటిపై సర్వే చేసి, సమగ్ర ప్రాజెక్టు నివేదికలను కూడా సమర్పించింది.

### పైప్‌లైన్‌ను పొడిగించిన రేవంత్ సర్కారు...

ఏడాది కిందట అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కొండపోచమ్మ కాకుండా మల్లన్నసాగర్ నుంచి గోదావరి జలాలను తరలించేందుకు నిర్ణయించింది. ఈ మేరకు కొంతకాలం కిందట రూ. 5560 కోట్ల అంచనా వ్యయంతో పరిపాలనాపరమైన ఉత్తర్వులు కూడా జారీ చేసింది. వ్యాప్కోస్ సంస్థ నివేదిక ప్రకారమే ఈ పథకాన్ని రూపొందించినట్లు అందులో పేర్కొన్నారు. కొండపోచమ్మ సామర్థ్యం కంటే మల్లన్నసాగర్ నిల్వ సామర్థ్యం ఎక్కువ ఉన్నందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. దీంతో డిజైన్ మార్పుపై పెద్ద ఎత్తున ఆరోపణలు వచ్చాయి. పైప్‌లైన్ పొడవు ఏకంగా 25-30 కిలోమీటర్ల మేర పెరుగుతుందని, కేవలం దీని కోసమే డిజైన్ మార్చి సుమారు రూ.2వేల కోట్ల అదనపు భారాన్ని ఎత్తుకున్నారనే విమర్శలు వినిపించాయి. అంచనా వ్యయాన్ని పెంచుకునేందుకే డిజైన్ మార్పు చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అనేక సార్లు ఆరోపణలు చేశారు.

### మళ్లీ కొత్తగా సర్వే ఎందుకు..?

గోదావరి జలాల తరలింపు పథకానికి గత నవంబర్‌లోనే టెండర్లు పిలిచేందుకు అధికారులు కసరత్తు చేశారు. కొన్నిరోజుల కిందట సీఎం రేవంత్ సమీక్ష సమావేశంలోనూ డిసెంబర్ మొదటి వారంలో టెండర్ల ప్రక్రియ చేపట్టాలని ఆదేశించారు. కానీ ఇప్పటివరకు జలమండలి ఆ ఊసే ఎత్తడం లేదు. పైగా మళ్లీ ఈ పథకంపై వ్యాప్కోస్ సర్వేను తెరపైకి తెచ్చారు. కొండపోచమ్మ సాగర్, మల్లన్నసాగర్, ఎల్లంపల్లి... ఈ మూడు మార్గాల్లో సర్వే చేసి, దేని ద్వారా సాధ్యాసాధ్యాలు ఎలా ఉన్నాయనే దానిపై నివేదిక రూపొందించేందుకు ఈ సర్వే చేపట్టినట్లు అధికారులు చెబుతున్నారు. అసలు గతంలోనే వ్యాప్కోస్ సర్వే చేసి ఇచ్చిన నివేదికలున్నాయి. మళ్లీ కొత్తగా సర్వే ఎందుకు? అనే సందేహాలు తలెత్తుతున్నాయి. మల్లన్నసాగర్ డిజైన్‌ను ఖరారు చేసేందుకే ఈ డ్రామా మొదలుపెట్టారనే విమర్శలు వినిపిస్తున్నాయి. వ్యాప్కోస్ తాజాగా చేసిన సర్వేలో మల్లన్నసాగర్ ద్వారానే చేపట్టాలని సూచించిందనే సిఫార్సు ఉంటుందని, దాని ఆధారంగానే తాము ముందుకువెళ్లామనే కారణాన్ని చూపేందుకే సర్వే చేయిస్తున్నారనే ప్రచారం జరుగుతున్నది. అంటే అసలే రూ. 2వేల కోట్ల అదనపు భారం అనే ఆరోపణలు వస్తుండగా... వ్యాప్కోస్ సర్వేకు మరిన్ని కోట్లు అదనపు ఖర్చు కానుండటం కొసమెరుపు.

# అదే జాప్యం..

**పది రోజుల గడువు పెట్టినా కదలని ఫైళ్లు**

**హెచ్ఎండీఏలో నిర్మాణ అనుమతులకు 10 రోజుల టార్గెట్**

సిటీబ్యూరో, డిసెంబర్ 12(నమస్తే తెలంగాణ): హెచ్ఎండీఏ పరిధిలో అనుమతుల జారీలో ఎలాంటి మార్పు లేదు. భవన నిర్మాణ అనుమతుల్లో జరుగుతున్న జాప్యం కారణంగా నిర్మాణదారులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నా... పనితీరులో మార్పు రావడం లేదు. కానీ గతేడాది కంటే పనితీరు మెరుగుపడిందని, వేగంగా అనుమతులను జారీ చేస్తున్నామంటూ ఉన్నతాధికారులు ప్రకటనలు జారీ చేయడం విస్మయానికి గురి చేస్తున్నది. పది రోజుల నిర్ణీత గడువులోగా అప్లికేషన్లను క్లియర్ చేయాలని ఇటీవలే ప్లానింగ్ విభాగానికి ఉన్నతాధికారులు డెడ్‌లైన్ విధించారు. కానీ క్షేత్రస్థాయిలో అందుకు భిన్నమైన పరిస్థితులే ఉన్నాయని పలువురు దరఖాస్తుదారులు చెబుతున్నారు. సాయంత్రం 3 గంటల తర్వాత హెచ్ఎండీఏ కార్యాలయంలో దరఖాస్తుదారులతో నిండిపోతుండగా, కుప్పలుగా పేరుకుపోతున్న దరఖాస్తులకు ఇదే నిదర్శనంగా నిలుస్తున్నది. ఓ వైపు టీఎస్ బీపాస్ ద్వారా దరఖాస్తులను తీసుకుంటున్నప్పటికీ.. క్షేత్రస్థాయి పరిశీలన, ఎన్‌ఓసీ, షార్ట్ ఫాల్స్ కారణంగా 10రోజుల్లో అనుమతులు జారీ చేయాలనే లక్ష్యాన్ని హెచ్ఎండీఏ చేరుకోవడం లేదు. ముఖ్యంగా హైడ్రా తర్వాత నగరంలో దరఖాస్తులను భూతద్దంలో పెట్టి చేస్తున్నారు. దీంతో అనివార్యంగానే దరఖాస్తుల పరిశీలన జాప్యం జరుగుతున్నదని ప్లానింగ్ విభాగం సిబ్బంది పేర్కొంటున్నారు. కొన్ని సాంకేతికత కారణాలతోనే అనుమతుల మంజూరులో జరుగుతున్న ఆలస్యానికి మాత్రం సంబంధిత అధికారులు స్పందించడం లేదు. గతంలో నగర పౌరులు సంబంధిత దరఖాస్తుల స్టేటస్ తెలుసుకునే వీలు ఉండగా, ఇప్పుడు సిటిజన్ సెర్చ్ ఆప్షన్‌లో కేవలం పాత, పెండింగ్ ఫైళ్లు మాత్రమే దర్శనం ఇస్తున్నాయి. నెలవారీగా దరఖాస్తులను చూసుకునే వీలు లేకపోవడంతో... దరఖాస్తుదారులు ఇబ్బందులు పడుతున్నారు. కనీసం ఇప్పటికైనా పబ్లిక్ డొమైన్‌లో నెలవారీగా అనుమతుల కోసం వచ్చిన దరఖాస్తులను పొందుపరచాలని, పారదర్శకంగా హెచ్ఎండీఏ నిర్వర్తిస్తున్న విధులకు ఇదొక కొలమానంగా నిలుస్తుందని పలువురు ఆర్కిటెక్చర్లు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా ప్రోగ్రెస్ రిపోర్టులను ఆన్‌లైన్‌లో పరిశీలించుకునే అవకాశం లేకపోవడంతో దరఖాస్తుదారులు హెచ్ఎండీఏ కార్యాలయానికి చక్కర్లు కొట్టాల్సి వస్తుందని వాపోతున్నారు.

### పెండింగ్ పనులపై హెచ్ఎండీఏ ఫోకస్

హెచ్ఎండీఏ పరిధిలో పెండింగ్‌లో ఉన్న పనులను సకాలంలో పూర్తి చేసేందుకు అధికారులు దృష్టి పెట్టారు. సుదీర్ఘకాలంగా నిర్మాణంలో ఉన్న కొత్వాల్‌గూడ ఏకో పార్క్, కోకాపేట నియోపోలిస్ లే అవుట్ అభివృద్ధి పనులతో పాటు, నగరంలోని పలు హెచ్ఎండీఏ పార్కుల పెండింగ్ పనులు పూర్తి చేయాలని ఉన్నతాధికారులు హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ ఆదేశించారు. ప్రస్తుతం టెండర్ దశలో ఉన్న ప్రతిష్టాత్మక ప్రాజెక్టులపై ఇటీవల సమీక్షించిన ఆయన.. పనుల్లో అలసత్వం చేయరాదని సూచించారు. కాగా, ట్రాన్సాక్షన్ అడ్వైజరీలతో అధ్యయనం చేస్తున్న ఎలివేటెడ్ కారిడార్, మీరాలం కేబుల్ బ్రిడ్జి నిర్మాణ పనులను మరింత వేగంగా పూర్తి చేసేలా అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

# గుడిసెలు తొలగించుకుంటారా హైడ్రాను పిలవమంటారా?

**గురుబ్రహ్మనగర్ బస్తీ వాసులకు రెవెన్యూ అధికారుల హెచ్చరిక**

బంజారాహిల్స్, డిసెంబర్ 12: జూబ్లీహిల్స్ డివిజన్ నందగిరి హిల్స్ సమీపంలోని గురుబ్రహ్మనగర్ బస్తీలో మరోసారి హైడ్రా పేరుతో రెవెన్యూ అధికారులు హల్‌చల్ చేశారు. గురువారం మధ్యాహ్నం షేక్‌పేట మండల కార్యాలయం నుంచి రెవెన్యూ సిబ్బంది గురుబ్రహ్మనగర్ బస్తీకి వచ్చి కొన్ని గుడిసెలను ఖాళీ చేయాలని, లేకుంటే హైడ్రా అధికారులు వచ్చి మొత్తం బస్తీలో కూల్చివేతలు చేపట్టే ప్రమాదం ఉందని హెచ్చరించారు. దీంతో బస్తీలో మరోసారి ఉద్రిక్తత చోటు చేసుకుంది. మూడునెలల కిందట బస్తీలో పేదల గుడిసెలకు అడ్డుగా హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశాలతో రాత్రికి రాత్రే ప్రహరీ కట్టడం, పేదల ఇండ్లలోకి వెళ్లకుండా దారులు మూయడంతో పెద్ద ఎత్తున గొడవలు చోటు చేసుకున్న సంగతి తెలిసిందే. ఆ వ్యవహారంలో కొంత మంది బడాబాబుల కోసం హైడ్రా కమిషనర్ రంగనాథ్ పనిచేస్తున్నాడని బస్తీవాసులు ఆందోళనకు దిగడంతో తాత్కాలికంగా వెనక్కి తగ్గారు. ఈ నేపథ్యంలో నాలుగు రోజుల నుంచి బస్తీకి వస్తున్న షేక్‌పేట రెవెన్యూ సిబ్బంది బస్తీలోని కొన్ని గుడిసెలు తొలగించాల్సి ఉంటుందని హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం కూడా కొంతమంది రెవెన్యూ సిబ్బంది బస్తీకి వచ్చి ఫొటోలు తీసుకుంటుండంతో బస్తీవాసులంతా అప్రమత్తమయ్యారు. మిమ్మల్ని ఎవరు పంపించారంటూ గట్టిగా నిలదీయగా, నీళ్లు నమిలారు. గతంలోనే గురుబ్రహ్మనగర్ పేదల బస్తీ జోలికి వచ్చిన హైడ్రా తీవ్ర అప్రతిష్టను మూటకట్టుకున్న నేపథ్యంలో మరోసారి ఇలాంటి చర్యలకు పాల్పడడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



గుడిసెల ఫొటోలు తీసేందుకు వచ్చిన రెవెన్యూ సిబ్బందితో వాగ్వాదానికి దిగిన బస్తీ అధ్యక్షుడు గోపాల్ నాయక్ తదితరులు



# మెహదీపట్నం స్కైవాక్ ఇంకెప్పుడు?

**పూర్తి కానీ నిర్మాణ పనులు**

**పాదచారులకు తప్పని ఇబ్బందులు**

సిటీబ్యూరో: నగరంలో మౌలిక వసతులను మెరుగుపరచడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమవుతున్నది. ఉప్పల్ స్కై వాక్ వే తరహాలో నగరంలో అత్యంత రద్దీగా ఉండే మెహదీపట్నం కేంద్రంగా స్కై వాక్ వేను నిర్మించేందుకు హెచ్ఎండీఏ పనులు చేపట్టింది. కానీ భూసేకరణ, ట్రాఫిక్ సమస్యలు, కమర్షియల్ భవనాల తొలగింపు వంటి కారణాలతో ఆటంకాలు ఏర్పడ్డాయి. కానీ వీటిని గత ప్రభుత్వమే పరిష్కరిస్తూ చర్యలు చేపట్టింది. కానీ దూసుకు వచ్చే వాహనాల నుంచి రక్షణ కల్పించే స్కైవాక్ వే నిర్మాణం మాత్రం పూర్తి కావడం లేదు. ముంబై హైవే, శంషాబాద్ ఎయిర్ పోర్టుకు వెళ్లే మార్గాల్లో అత్యంత ట్రాఫిక్ మెహదీపట్నం జంక్షన్‌లో ఉంటుంది. సిటీ బస్సులు ఓవైపు, ఇతర ప్రాంతాలకు వెళ్లే వాహనాలతోపాటు, నిత్యం వేలాదిగా ఐటీ కారిడార్‌కు ప్రయాణించే వాహనదారులతో ఈ ప్రాంతం కిక్కిరిపోతున్నది. దీంతో వాహనదారులే ఇబ్బంది పడుతుంటే... పక్కనే ఉండే రైతు బజార్‌కు వచ్చే కొనుగోలుదారులతో నిత్యం ట్రాఫిక్ నిలుస్తూనే ఉంటుంది. దీంతో కనీసం బాటసారులు కూడా నడిచే పరిస్థితి ఉండదు. దీంతో ట్రాఫిక్ సమస్యల నుంచి పాదచారులకు ఇబ్బందులు లేకుండా ఉండేలా, ప్రమాదరహిత మార్గంగా స్కైవాక్ వేలను గత ప్రభుత్వం డిజైన్ చేసింది. ఇందులో ఒకటి ఉప్పల్ జంక్షన్‌లో ఏర్పాటు చేయగా, రెండోది మెహదీపట్నంలో నిర్మించేందుకు పనులు చేపట్టారు. దాదాపు రెండేండ్లుగా ఆ పనులు సాగుతూనే ఉన్నాయి. ఇప్పటికీ ఆ ప్రాజెక్టు నిర్మాణ దశలోనే ఉండటంతో... పాదచారులకు ఇబ్బందులు తప్పడం లేదు.

# బంజారాహిల్స్‌లో ఆపరేషన్ రోప్

**ప్రధాన రహదారుల్లో 75 ఆక్రమణల తొలగింపు**

బంజారాహిల్స్: ఆపరేషన్ రోప్ కార్యక్రమంలో భాగంగా బంజారాహిల్స్ రోడ్ నం. 12లోని ప్రధాన రహదారుల్లో రోడ్డు ఆక్రమణలను ట్రాఫిక్ పోలీసులు, జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ సిబ్బంది సంయుక్తాధ్వర్యంలో గురువారం తొలగించారు. మినిస్టర్స్ క్వార్టర్స్ వెళ్లే రోడ్డుతో పాటు కమాన్ వద్ద, ఎన్‌బీనగర్ బస్తీకి వెళ్లేదారితో పాటు సితార హోటల్ దాకా రోడ్డుకు ఇరు వైపులా ఆక్రమణల తొలగింపు చేపట్టారు. వెస్ట్ జోన్ ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే, ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్‌తో పాటు టౌన్ ప్లానింగ్ శ్రీనివాస్ తదితరుల ఆధ్వర్యంలో కమాండ్ కంట్రోల్ దాకా ఆక్రమణల తొలగింపు చేపట్టారు. మోర్ మెడికల్ హాల్ సమీపంలో ఓ భవన యజమాని రోడ్డుపై ఫుట్‌పాత్‌ను కబ్జా చేసి ఫెన్సింగ్ ఏర్పాటు చేసుకున్న విషయాన్ని గుర్తించి..ఆ ఫెన్సింగ్‌ను తొలగించారు. మొత్తం 75 ఆక్రమణలను తొలగించామని, ఆక్రమణలతో ట్రాఫిక్ సాఫీగా సాగలేకపోతోందని, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ఫిర్యాదులు వస్తున్నాయని ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే పేర్కొన్నారు. ఆక్రమణలకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.



# పుర నిధులు.. సొంత పనులు

- జనావాసాలకు దూరంగా ప్రగతి పరుగు
- ప్రజల సొమ్ము దుర్వినియోగంపై విమర్శలు
- పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీపై నిఘా కరువు

> "పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ పరిధి కుంట్లూరుకు చెందిన ఓ ప్రజాప్రతినిధి.. తన కుటుంబసభ్యులు, బంధువుల పట్టా భూములకు రోడ్డు కోసం ఏకంగా రూ.20 లక్షల మున్సిపల్ నిధులకు మున్సిపల్ కౌన్సిల్‌లో తీర్మానం చేసేశారు. ఏడాది గడిచాక పనులు మొదలుపెట్టారు. అదీనూ చెరువు ఎఫ్‌టీఎల్, ప్రభుత్వ భూమి నుంచి వేసేందుకు సిద్ధమయ్యారు.
>
> పెద్దఅంబర్‌పేటలో జాతీయ రహదారిపై ఉన్న ఓ కన్వెన్షన్‌కు ఆనుకుని రూ.30 లక్షల మున్సిపల్ నిధులతో కన్వెన్షన్ మురుగు వెళ్లేందుకు అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, దుమ్మురాకుండా సీసీ రోడ్డు వేసుకున్నారు మరో ప్రజాప్రతినిధి. వార్డుకు కేటాయించిన నిధులను పక్కవార్డులో ఉన్న బంధువుల కన్వెన్షన్ వద్ద రోడ్డుకు మళ్లించారు. రూ.10 లక్షలకే టెండర్ అయినప్పటికీ.. మొత్తం రూ.30 లక్షల నిధులతో పనులు పూర్తిచేశారు."



కుంట్లూరు పెద్ద చెరువులో వేసిన రోడ్డు (ఇక్కడ సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.20 లక్షలకు అనుమతిస్తూ మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం చేసింది)

రంగారెడ్డి, డిసెంబర్ 12(నమస్తేతెలంగాణ)/పెద్దఅంబర్‌పేట: పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీలోని పలువురు ప్రజాప్రతినిధులు ప్రజల మేలు మరిచి సొంత పనులకు పెద్దపీట వేస్తున్నారు. ప్రజా అవసరాలను స్వేచ్ఛగా పక్కన పెట్టేస్తున్నారు. బంధువర్గానికి అనుకూలంగా, సొంత పనులను చక్కబెట్టేస్తున్నారు. ప్రజలు కట్టిన పన్నుల రూపంలోని నిధులను దుర్వినియోగం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించకపోతే రూ.కోట్ల ప్రజాధనం ప్రజాప్రతినిధుల సొంత పనులకే ఉపయోగపడే పరిస్థితులున్నాయి.

### సమస్యలు వదిలి.. సొంత పనులకు కదిలి

మున్సిపాలిటీలో కౌన్సిల్ తీర్మానాల ద్వారా అభివృద్ధి పనులు చేపడుతారు. తమకు వచ్చిన నిధులను వార్డు పరిధిలోని కాలనీల్లో సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యం ఇవ్వాలి. ఉమ్మడి సమస్య ఉంటే దాని పరిష్కారానికి అన్ని వార్డుల ప్రజాప్రతినిధులు కలుస్తారు. ఆయా వార్డుల నిధులను సైతం మళ్లించి ఉమ్మడి సమస్య పరిష్కారానికి కృషి చేయొచ్చు. కానీ, వార్డుకు కేటాయించిన నిధులతో కొందరు ప్రజాప్రతినిధులు.. తమ అనుయాయులు, బంధువులు లేదా సొంతవారికి అవసరమైన చోట ప్రగతి పనులు చేస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. సొంత ఫామ్ హౌజ్‌లకు, నిర్మించబోయే కన్వెన్షన్‌లకు, వ్యాపార, వాణిజ్య సముదాయాల వద్ద వసతుల కల్పనకు మున్సిపల్ నిధులు వినియోగిస్తున్నట్టు ప్రచారం జరుగుతున్నది. ఆయా వార్డుల్లో కాలనీలు పెరిగి మౌలిక వసతులు కల్పించాల్సి ఉన్నా.. అవేమీ పట్టకుండా అయినవారికి వసతులు కల్పించేందుకు అందలం వేస్తున్నారు. ఓ ప్రజాప్రతినిధి తన వార్డుకు కేటాయించిన రూ. 30 లక్షల నిధులను పక్క వార్డుకు మళ్లించారు. పెద్దఅంబర్‌పేట పరిధిలో హైవేకు ఆనుకుని ఉన్న బంధువులకు చెందిన ఓ కన్వెన్షన్‌లోని మురుగు నీరు వెళ్లేందుకు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులు చేపట్టారు. కుంట్లూరుకు చెందిన ఓ ప్రజాప్రతినిధి.. పట్టా భూమిలో ఓ కన్వెన్షన్ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించినట్టు తెలుస్తున్నది. నిర్మాణానికి హెచ్ఎండీఏ అనుమతి కావాలంటే 40 ఫీట్ల రోడ్డు అవసరం. ఇందుకోసం ఏకంగా కుంట్లూరు పెద్ద చెరువులో నుంచి రోడ్డు వేసేందుకు సిద్ధమైనట్టు ఆరోపణలు ఉన్నాయి. ఈ పనులకు మున్సిపల్ కౌన్సిల్ రూ.20 లక్షల నిధుల మంజూరుకు తీర్మానం చేసింది. దీనిపై స్థానికుల ఫిర్యాదుతో హైడ్రా అధికారులు చెరువు సర్వే చేపడుతున్నారు. చెరువులో నుంచే రోడ్డు వేస్తున్నట్టు గుర్తించి, వేసిన రహదారిని తొలగించాలని స్వయంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశించారు. సర్వే చేసి కుంట్లూరు పెద్ద చెరువుకు హద్దులు నిర్ధారించాలని ఆదేశాలు జారీ చేశారు. మరో వైపు, మున్సిపల్ కౌన్సిల్‌లో తీర్మానించిన చాలా పనులకు ఎలాంటి టెండర్లు పిలవడంలేదనే ఆరోపణలు ఉన్నాయి. ఆయా పనులపై ఫిర్యాదులు వెళ్లినా చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరు ప్రజాప్రతినిధుల వ్యక్తిగత స్వార్థం కోసం జనావాసాలను వదిలి, వారి ప్లాట్లు, ఇతర ఫామ్‌హౌస్‌ల వద్ద మున్సిపల్ నిధులతో సౌకర్యాలు కల్పిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇండ్లు ఉండి కూడా సమస్యలతో అల్లాడుతున్నామని పలు కాలనీల ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.